ప్రజాశక్తి
మంగళవారం 25 ఫిబ్రవరి 2025 5
శ్రీ సత్యసాయి

ఫిర్యాదుదారులతో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

రీ సర్వేపై క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని ఆర్డీవోలు అందరూ వారి పరిధిలో జరుగుతున్న రీ సర్వేను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఫ్రీ హోల్డ్, ఇంటి స్థలాలు, రెవెన్యూ సేవలు, రీ సర్వే, ప్రజా సమస్యల పరిష్కార వేదిక వినతులు, రైతులకు గుర్తింపు కార్డులు, తదితర అంశాలపై సంబంధిత ఆర్డీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ లో వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన అంశాలను ఈ నెల 28 లోపు పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎం ఈ సర్వే పనులను త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదని పారదర్శకంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో 233 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ తమ శాఖకు వచ్చే అర్జీలను జవాబు తరంతో బాధ్యతగా క్షేత్రస్థాయిలో వెళ్లి సమస్య మూలాలను తెలుసుకుని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అన్ని శాఖల హెచ్ఒడిలు అందరూ ఫీడ్ బ్యాక్ నివేదికలపై బాధ్యత వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పి-4 సర్వేను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, పట్టు పరిశ్రమ జేడీ పద్మావతి, సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ వెంకట రమణారెడ్డి, సర్వే ఏడీ విజయశాంతి బాయితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడా సుబ్బిరెడ్డి కన్నుమూత

బడా సుబ్బిరెడ్డి (ఫైల్‌ఫోటో)

శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలులో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున తుది శ్వాస విడిచారు. కదిరి ప్రాంతానికి చెందిన బడా సుబ్బిరెడ్డి సిపిఎం, రైతుసంఘం నాయకునిగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలందరికీ సుపరిచితుడు. రైతులు, రైతు సమస్యలపై ఆయన అలుపెరగని పోరాటం సాగించారు. రైతులకు ఎక్కడ సమస్య ఉందన్నా అక్కడికి వెళ్లి వారి సమస్య పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించారు. రైతులను ఏకం చేసి ఉద్యమాలను నిర్మించడంలో ఆయన కృషి ఎనలేనిది. తాను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజలకు అండగా నిలుస్తూ నాలుగు దశాబ్దాలుగా సిపిఎం జెండా అడుగుజాడల్లో నిలిచారు.

- ◆ నాలుగు దశాబ్దాలుగా కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర
- ◆ రైతు సమస్యలపై నిరంతర పోరాటం
- ◆ నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలిచిన నేత
- ◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో పాటు, ప్రముఖుల సంతాపం
- ◆ ఎర్రదండు విప్లవ జోహార్ల నడుమ అంత్యక్రియలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం వరిగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బడా సుబ్బిరెడ్డి 1995లో పాడి రైతుల ఉత్పత్తి దారుల సంఘం నాయకునిగా ప్రజా ఉద్యమంలోకి అడుగు పెట్టారు. అక్కడి నుంచి రైతుసంఘం, సిపిఎం నాయకునిగా ఎదిగారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలో సిపిఎం కదిరి డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు. నాలుగు దశాబ్దాల పాటు సిపిఎంలో ఉంటూ నమ్మిన సిద్ధాంతం కోసం మొక్కవోని దీక్షతో ప్రజాపోరాటాలు సాగించారు. కదిరి ప్రాంతంలోనే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు, కార్మికుల సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సిపిఎం అనుబంధ సంఘాలు ఇచ్చిన ప్రతి పిలుపునూ అందుకుని సుదీర్ఘ కాలంగా అనేక ఉద్యమాలు కొనసాగించారు. కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర ఆందోళనలు కొనసాగించారు. 2014లో ఎన్‌పి.కుంట మండలంలో సోలార్ కంపెనీ ఏర్పాటు సమయంలో రైతులకు మెరుగైన పరిహారం కోసం పోరాటాలు చేశారు. పేద రైతులకు భూములు ఇవ్వాలని సాగించిన భూ స్వాధీన పోరాటంలో పాల్గొని పట్టాలు ఇప్పించగలిగారు.

పలువురి నివాళి

బడా సుబ్బిరెడ్డి మరణ వార్త తెలుసుకుని పార్టీలకు అతీతంగా పలువురు నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ, డాII గేయానంద్, మాజీ ఎమ్మెల్యేలు డాII సిద్ధారెడ్డి, అత్తార్ చాంద్‌బాషాలు నివాళి అర్పించారు. వీరితో పాటు అనంతపురం సిపిఎం జిల్లా

సుబ్బిరెడ్డి పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న రాంభూపాల్ తదితరులు

సుబ్బిరెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న సిపిఎం, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, మద్దతదారులు

రైతు సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళనలో మాట్లాడుతున్న బడా సుబ్బిరెడ్డి (ఫైల్‌ఫోటో)

కార్యదర్శి ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, పెనుకొండ హరి, సిపిఎం జిల్లా నాయకులు ఎం.ఇంతియాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సిఐటియు సత్యసాయి జిల్లా అధ్యక్షులు జెడ్పీ.శ్రీనివాసులు, కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, ఐద్వా నాయకురాలు దిల్షాద్, శాంతబాయి, రంగమ్మ, లక్ష్మీదేవి, మున్సిపల్ యూనియన్ నాయకులు తిరుపాల్, బాలకృష్ణ తదితరులు నివాళి అర్పించారు.

వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు

బడా సుబ్బిరెడ్డి అంత్యక్రియలు సిపిఎం, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వరిగిరెడ్డిపల్లిలో సోమవారం సాయంత్రం జరిగాయి. సుబ్బిరెడ్డి నివాసం నుంచి ఆయన వ్యవసాయ క్షేత్రం వరకు అంతిమయాత్రను నిర్వహించారు. 'జోహార్ బడా సుబ్బిరెడ్డి.. జోహార్ బడా సుబ్బిరెడ్డి.. రెడ్ సెల్యూట్ కామ్రేడ్'.. అంటూ అంతిమయాత్రలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు నినాదాలు చేశారు. బడా సుబ్బిరెడ్డి భార్య, కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, కుమార్తె కళావతి, కుటుంబ సభ్యులు, వామపక్ష పార్టీల మద్దతుదారుల సమక్షంలో వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియల కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

వి.శ్రీనివాసరావుతో పాటు పలువురి నివాళి

కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి మతి విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. రైతు, ప్రజా ఉద్యమంలో సుబ్బిరెడ్డి ప్రముఖపాత్ర పోషించారని శ్రీనివాసరావు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డాII గేయానంద్, మాజీ ఎమ్మెల్యేలు పివి.సిద్ధారెడ్డి, అత్తార్ చాంద్‌బాషాలు సుబ్బిరెడ్డి పార్థివదేహం వద్ద నివాళు అర్పించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులుతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సిపిఎం, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు.

ప్రజా ఉద్యమానికి తీరనిలోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్

సీనియర్ సిపిఎం నాయకుడు కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. సుబ్బిరెడ్డి మరణవార్త తెలియగానే రాంభూపాల్ ఆయన స్వగ్రామం వరిగిరెడ్డిపల్లికి చేరుకున్నారు. సుబ్బిరెడ్డి నివాసం వద్ద పార్థివదేహంపై సిపిఎం జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ సుబ్బిరెడ్డి సుదీర్ఘ కాలంగా రైతాంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు కొనసాగించారని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక ఉద్యమాలు చేసి ప్రజల పక్షాన నిలిచారని గుర్తు చేశారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రభుత్వ భూముల్లో సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు రైతాంగం సహకరించాలని తహశీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు. సోమవారం మర్రికొమ్మదిన్నె పంచాయతీ కేంద్రంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను తరతరాలుగా సాగు చేస్తున్నామని,వ్యవసాయ యోగ్యంగా మార్చుకోవడానికి నాలుగు తరాలు పట్టిందని,అటువంటి భూముల్లో ఎలాంటి పరిహారం లేకుండా సోలార్ ఏర్పాటు చేస్తే వ్యతిరేకిస్తామని ముక్తకంఠంతో రైతులు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ పట్టా భూముల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయబోమని తెలిపారు.ప్రభుత్వ భూములను గతంలో సాగు చేస్తున్న రైతులను రెవెన్యూ అధికారులు గుర్తించి వారు భూములు సరిహద్దులను చూపే చిత్ర పటాలను చూపి ఆయా భూముల రైతులకు సర్వే అధికారులు అందించారని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాలన్నింటిని కలెక్టర్ దృష్టికి గత ప్రభుత్వ హయాంలో తీసుకెళ్లామని రైతులు తెలిపారు. సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని, మండల కేంద్రంలో ధర్నాలు చేస్తామని రైతులు హెచ్చరించారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

మహాసభలో ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

- ◆ కూటమి ఎన్నికల హామీలను అమలు చేయాలి
- ◆ తల్లికివందనం వెంటనే ఇవ్వాలి
- ◆ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

ప్రజాశక్తి-పెనుకొండ
పెనుకొండ టౌన్

కార్పొరేట్ జపం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని, ఇలాంటి సమయంలో ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలే మార్గమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని శ్రీసత్యసాయి కళాశాలలో శ్రీసత్య సాయి జిల్లా ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా మహాసభను నిర్వహించారు. మహాసభకు జిల్లా నలుమూలల నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు హాజరయ్యారు. మహాసభ ప్రారంభం సందర్భంగా సోమవారం నాడు మృతి చెందిన రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డికి నివాళులు అర్పించారు. అనంతరం మహాసభను ఉద్దేశించి ప్రసన్నకుమార్ మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రభుత్వ విద్య బలోపేతానికి కూటమి నాయకులు అనేక వాగ్దానాలు చేశారన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళంలో అనేక హామీలు ఇచ్చారన్నారు. అయితే ఆ హామీల అమల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. తల్లికివందనం, పెండింగ్ ఫీజుల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. తల్లికి వందనం నిధులను తల్లుల ఖాతాల్లో వేయాలన్నారు. నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. సత్యసాయి జిల్లా పెనుకొండలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను కాషాయీకరణ చేసేలా నిర్ణయాలు చేస్తోందన్నారు. గత 10 ఏళ్లలో దేశంలో విద్యారంగాన్ని సర్వనాశనం చేసిన ఘనత బిజెపికి దక్కుతుందన్నారు. ఇలాంటి చర్యలను విద్యార్థి లోకం తిప్పికొట్టాలన్నారు. విద్యా, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఈఎస్.వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగార్జున, నాయకులు పవన్, హర్షకుమార్, బాబావలి, బాబ్‌జాన్, అనిల్, భరత్, విష్ణువర్ధన్‌తో పాటు జిల్లాలోని ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, ప్రొసీడింగ్ అధికారి శివశంకర్, ఎంపీడీవో నాగేశ్వరరెడ్డి, ఎస్ ఆర్పి చంద్రమోహన్, మండల కన్వీనర్ విజయ్ కుమార్, మాజీ మండల కన్వీనర్ గంగాధర్, పి ఆర్ ఇంజనీర్ శశి, క్లస్టర్ ఏపీడి జ్యోతి, ఏపీవో మధుసూదన్, అన్నపూర్ణ, టెక్నికల్ అసిస్టెంట్ పుష్పలత, పాల్గొని ప్రసంగించారు. మండలం వ్యాప్తంగా 2023, 24 సంవత్సరంలో నిర్వహించిన పనులకు గాను ఈనెల 10వ నుండి 17వ తేదీ వరకు నిర్వహించిన సామాజిక తనిఖీల్లో ఐదు కోట్ల రూపాయల పైచిలుకు జరిగిన ఉపాధి హామీ పనులకు గాను ఆయా గ్రామ పంచాయతీల్లోనీ గ్రామాల్లో జరిగిన పనులకు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. అందులో 50వేల రూపాయలు వివిధ రకాలుగా అవినీతి జరిగినట్లు తనిఖీ బృందం గుర్తించింది. వాటిని రికవరీ చేయాలని అధికారులు అదేశించారు. మండలంలో జరిగిన అవకతవకలపై సామాజిక తనిఖీ అధికారి బాలాజీ పంచాయతీ గ్రామాల్లో జరిగిన పనులలో ఏ విధంగా అవినీతి జరిగిందని అంశాన్ని అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందంతో పాటు ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండల పరిధిలో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మవరం మండలంలోని ఇరవై గ్రామ పంచాయతీలలో 1-4-2023 నుండి 31-3-2024 వరకు ఉపాధి నిధులతో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారన్నారు. తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజా వేదికను మంగళవారం ఉదయం 10-30 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన సజ్జనార్

ప్రజాశక్తి - లేపాక్షి

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ సతీసమేతంగా సోమవారం లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాస్ మూర్తి నరసింహ శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన వీరభద్ర అన్న ప్రసాదం సేవా ట్రస్ట్ సందర్శించి నూతనంగా ఏర్పాటు చేసిన కాంస్య అన్నపూర్ణేశ్వరి విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో నాలుగు పతకాలు

ప్రజాశక్తి-హిందూపురం

వరల్డ్ ఫిట్నెస్ ఫెడరేషన్ (డబ్ల్యూ ఎఫ్ ఎఫ్) ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో హిందూపురం పట్టణానికి చెందిన నవీద్ వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నాలుగు పతకాలను కైవసం చేసుకున్నాడు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుండి 200 మంది పోటీదారులు హాజరయ్యారు. పట్టణంలోని గోల్డెన్ జిమ్ లో శిక్షణ పొందిన నవీద్ శారీరక దృఢత్వం విభాగంలో బంగారు పతకాన్ని సాధించగా సీనియర్ బాడీ బిల్డింగ్ కేటగిరిలో సిల్వర్ పతకాన్ని, జూనియర్ బాడీ బిల్డింగ్ పోటీల్లో సిల్వర్ పతకాన్ని, క్లాసిక్ శారీరక దృఢత్వం పోటీల్లో నాలుగవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను పోటీల్లో పాల్గొనేందుకు సహకరించిన జిమ్ నిర్వాహకులు ఆరిపుల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా జిమ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి హిందూపురం పట్టణ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసిన నవీద్ ను స్థానిక బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

సాధించిన పతకాలతో నవీద్

జాతీయ సమైక్యత శిబిరంలో మెరిసిన 'పురం' విద్యార్థిని

విద్యార్థిని దుర్గను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.దుర్గ జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభను ప్రదర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం. ప్రగతి పేర్కొన్నారు. పట్టణంలోని శాంతినగర్ కు చెందిన సుబ్బు, నాగమ్మ దంపతుల కుమార్తె దుర్గ స్థానిక ఎన్ ఎస్ పి ఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ గా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం తరపున ఆంధ్రప్రదేశ్ బృందానికి ఎంపికైంది మహారాష్ట్ర కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయంలో వారం రోజులపాటు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయాలపై ప్రసంగించి, జానపద నృత్యంలో విశేష ప్రతిభ కనపరిచి కళాశాల కీర్తిని ఇనుమడింప చేసిందన్నారు. వారం రోజుల శిబిరాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుని, ఎన్ఎస్ఎస్ ఉన్నతాధికారుల నుండి సర్టిఫికెట్ ని పొందిన దుర్గనుకళాశాల సిబ్బంది, సహచర విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.వెంకటేషులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్. శ్రీలక్ష్మి, ఫిజిక్స్ అధ్యాపకులు ఎల్ఆర్ రమేష్, కామర్స్ అధ్యాపకులు బాలిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపుదలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలంలో భూగర్భజలాల పెంపుదలకు తాము ప్రాధాన్యతను ఇస్తున్నామని అందులో భాగంగా ఉపాధి పథకం కింద ఫారంపాండ్లు ఏర్పాటు చేస్తున్నామని ఏపీవో సంజీవ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని చిల్ల కొండయ్య పల్లి గ్రామపంచాయతీలో చేపట్టిన ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ పూలకుంట రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

ప్రజాశక్తి - కొత్తచెరువు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నటరాజ్ తెలిపారు. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసి వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - నల్లమాడ

రైతుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్‌కు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం మండల నాయకులు గోవిందు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర మోహన్‌రెడ్డి, అంజినప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యోత్సవ ముగింపు వేడుకలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని కూచిపూడి కళా కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాయలసీమ నృత్యోత్సవ ముగింపు వేడుకలు బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, చెన్నం శెట్టి జగదీష్, లక్ష్మి గోవింద చౌదరి, పుల్లయ్య, కలవల మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరంలో ఇలాంటి కార్యక్రమాలు ధర్మవరంలో నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కన్వీనర్ నటరాజ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో నిర్వహించిన ఈ పోటీలు విజయవంతం కావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు.

వికలాంగుల భవనానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణం లోని శ్రీ సాయి రూరల్ విభిన్న ప్రతిభావంతుల మండల సమైక్య భవనానికి స్థలం కేటాయించాలని ఆసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నటరాజ్, ఆర్డీవో మహేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కాంతమ్మ, కార్యదర్శి కొండయ్య, సభ్యులు ఈశ్వరక్క, లక్ష్మి ,ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -దర్మవరం రూరల్

పట్టణంలోనిపెనుజూరు కాలనీ నూతన ప్రభుత్వ హాస్పిటల్ పక్కనగల మెహర్ బాబా సెంటర్‌లో మంగళవారం రక్త దాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేత లోకేష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరం డాక్టర్ మారు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన సేవలను ధర్మవరం స్వచ్ఛంద సంస్థలు కొనియాడుతూ రెడ్ క్రాస్, ఎన్జీవోల సహాయంతో ఈ రక్తదాన శిబిరమును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

ప్రజాశక్తి- చిలమత్తూరు

మార్చి నెల 1 వ తేదీ నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సర్వ సిద్ధం చేస్తున్నారు. సోమవారం ఇంటర్మీడియట్ ప్రశ్నా పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు రూట్ ఆఫీసర్ రామంజిన రెడ్డి ఆధ్వర్యంలో తరలించారు. ప్రశ్నపత్రాలను పోలీసులు భద్రపరిచారు. పటిష్టమైన భద్రత నడుమ ప్రశ్నపత్రాలను ఉంచినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి - చిలమత్తూరు

వైసిపికి చెందిన పలువురు యువకులు సోమవారం జనసేన పార్టీలో చేరారు. ఈ మేరకు జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరినట్లు ఆ యువకులు తెలిపారు. సీనియర్ నాయకులు రమణ,చిన్నా ప్రవీణ్ ఆధ్వర్యంలో జనసేన చిలమత్తూరు కార్యాలయంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేష్, సురేంద్రరెడ్డి,అంజన రెడ్డి, బాలు, మహేష్, అశోక్ రెడ్డి, జి.సురేష్, సందీప్,చంద్రశేఖర్, అనిల్ కుమార్,చంద్ర, నారాయణ స్వామి ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ అగ్గి శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు వెంకటశివ, మండల నాయకులు ఆంజనేయులు, లక్ష్మణ మూర్తి, మనోహర్, కృష్ణమూర్తి, జగదీష్, శెట్టిపల్లి రామాంజినేయులు, మణికంఠ పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో నాయకులు

బడా సుబ్బిరెడ్డి మృతి తీరని లోటు

బడాసుబ్బిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కదిరి మండలానికి చెందిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి మృతి బాధాకరమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుబ్బిరెడ్డి ఎన్నో భూ పోరాటాలు చేశారన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి కార్యక్రమంలోనూ చిత్తశుద్ధితో పాల్గొన్నారని గుర్తు చేశారు. తుది శ్వాస విడిచే వరకు రైతాంగ సమస్యలపై పని చేశారన్నారు. ముఖ్యంగా ఎన్ పి కుంటలో సోలార్ కంపెనీ ఏర్పాటు సమయంలో రైతులకు నష్టపరిహారం పై ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేశారన్నారు. ఆయన లేని లోటు తీరనిది అన్నారు.

ధర్మవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బడా సుబ్బారెడ్డి అనారోగ్యంతో కదిరిలో ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఈ మరణ వార్త తెలిసిన వెంటనే సోమవారం ధర్మవరం సిపిఎం, సిఐటియు, రైతు సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న సిపిఎం పార్టీ నాయకులు ఎస్ హెచ్ భాష, ఏ మారుతి, సిఐటియు నాయకులు జెవి రమణ టి అయూబ్ ఖాన్ ఎల్ ఆదినారాయణ, ఎస్ రఫీ తదితరులు కదిరిలో బడాసుబ్బిరెడ్డి మృత దేహానికి నివాళులు విప్లవ జోహార్లు అర్పించారు. బడాసుబ్బిరెడ్డి మృతితి ఏపీ రైతు సంఘానికి, పేదలకు తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్తచెరువు: రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి మృతికి ఆపార్టీ జిల్లా నాయకులు ఈఎస్ వెంకటేష్, సిపిఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ళ అంజి మండల కార్యదర్శి ముత్యాలు సంతాపం తెలిపారు. బడాసుబ్బిరెడ్డి ఉమ్మడి జిల్లాలో సిపిఎం, రైతు సంఘంలో ప్రజా సమస్యల పట్ల నిరంతరం పోరాటాలు నిర్వహించారన్నారు. ఆయన మృతి పార్టీకి తీవ్ర లోటు అని అన్నారు.

నంబులపూలకుంట: ప్రజల సమస్యలపై అంకితభావంతో పోరాటం చేసిన వ్యక్తి బడా సుబ్బిరెడ్డి అని మండల సిపిఎం,సిపిఐ నాయకులు అన్నారు. బడాసుబ్బిరెడ్డికి మృతికి నాయకులు పి గంగిరెడ్డి, రమణ, నాగరాజు, సూర్యనారాయణరెడ్డి, ఈశ్వరరెడ్డి,ఈ మల్లిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని సోలార్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితుల పరిహారం చెల్లింపులో ప్రభుత్వంపై నిరంతర పోరాటం చేశారని గుర్తుకు తెచ్చుకున్నారు. ఆయన మృతి తీరని లోటు అని అన్నారు.

గాండ్లపెంట : సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడాసుబ్బిరెడ్డి మృతికి సిపిఎం స్థానిక నాయకులు సంతాపం తెలిపారు. నాయకులు కేకే రాజారెడ్డి, ఖాదర్ బాషా, గంగన్న, హమాలీ యూనియన్ నాయకులు ఎం కొండయ్య, బయన్న, ఎర్రదొడ్డి నరసింహులు తదితరులు మాట్లాడుతూ బడాసుబ్బిరెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

రొద్దం : రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని కెవిపిఎస్ నాయకులు అన్నారు. ఈసందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి. రమణ అధ్యక్షులు అన్నమయ్య మాట్లాడుతూ రైతుల కోసం ఆయన చేసిన పోరాటాలను గుర్తుకుతెచ్చుకున్నారు.

ప్రతిభా విద్యార్థినులతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నాయకులు

బాస్కెట్‌బాల్ పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఉమ్మడి జిల్లా స్థాయిలో ఈ నెల 22 ,23 తేదీల్లో అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియం నందు జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్డీటీ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ధర్మవరం బాలికల, బాలుర జట్లు విజేతలుగా నిలిచాయని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయ చంద్రారెడ్డి తెలిపారు. అండర్ 15 విభాగంలో జరిగిన బాలికల ఫైనల్స్ పోటీల్లో బుక్కరాయసముద్రం జట్లుతో పోటీ పడిన ధర్మవరం బాలికల జట్టు విజేతగా నిలిచిందన్నారు. అలాగే బాలుర ఫైనల్ పోటీలో బుక్కరాయసముద్రంతో పోటీ పడిన ధర్మవరం జట్లు విజేతగా నిలిచిందన్నారు. విజేత జట్లను సోమవారం సాయంత్రం ధర్మవరం పట్టణంలోని స్థానిక బాస్కెట్బాల్ క్రీడా మైదానంలో శెట్టిపి జయచంద్రారెడ్డి తో పాటు ధర్మాంబా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామి రెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, కోచ్ సంజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, రమేష్ బాబు అభినందించారు.

ఇసుక, మట్టి తరలింపునకు అనుమతులివ్వండి

ప్రజాశక్తి - పరిగి

తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక, మట్టి తరలింపుకు అనుమతులు ఇస్తామని గత ఎన్నికల్లో టిడిపి హామీ ఇచ్చిందని ఆ మేరకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని టిడిపి స్థానిక నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం స్థానిక తహశీల్దార్ హసీనాసుల్తానా, ఎస్ఐ రంగడు యాదవ్‌కు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉచిత మట్టి ఇసుక తరలింపునకు టిడిపి ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు..దీని ప్రకారం కొన్ని ప్రాంతాలలో ఉచిత ఇసుక మట్టి తవ్వకాలు నిర్వహిస్తుంటే పరిగి మండలంలో ఆంక్షలు విధిస్తున్నారని విమర్శించారు. మండల కేంద్రంలో ఇటుక బట్టీల వ్యాపారులు ఎక్కువగా ఉన్నారని వారికి జీవనోపాధి జరగాలంటే మట్టి తవ్వకాలు అనుమతి ఇవ్వాలని వారు కోరారు. గతంలో సైతం మంత్రి సవితమ్మ ఇసుక మట్టి తవ్వకాలపై అనుమతులు ఇచ్చారని అయితే మండలంలో అమలు కావడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచి శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపిటిసి కుమార్, చంద్రశేఖర్ కొడిగేనహళ్లి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

అభివృద్ధికి నోచుకోని బీడీ కార్మికులు

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీడీ కార్మికులు

బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులు

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

ఏళ్ల తరబడి బీడీలు చుడుతున్న బీడీ కార్మికులు అభివృద్ధి, సంక్షేమంకు దూరంగా ఉన్నారని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులు పేర్కొన్నారు. బీడీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బీడీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ రజాక్ వలికు అందజేశారు. ముందుగా స్థానిక ఎన్జీవో హోంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ఎంతో కాలంగా బీడీలు చుట్టి కష్టానికి తగ్గ వేతనం లేక అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1000 బీడీలు చుడితే కేవలం రూ.200 మాత్రమే బీడీ కంపెనీలు ఇస్తున్నాయన్నారు. అందులోనూ రూ.25 నుంచి రూ.40 వరకు కోత విధిస్తూ బీడీ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నాయని తెలిపారు. బీడీలు చుట్టా ఆ పొగాకు గాటుకు కార్మికులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. వీరి కోసం ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. వెయ్యి బీడీలు చుట్టేవారికి కనీసం రూ.300 రూపాయలు కూలి ఇవ్వాలన్నారు. నిరుపేదలైన బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలన్నారు. పిఎఫ్, చట్టబద్ధమైన ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కన్వీనర్ ఉమా గౌడ్, బీడీ కార్మిక సంఘం రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, సిఐటియు నాయకులు హనుమంత్ రెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ, భాస్కర్, నాగరాజు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం : మాజీమంత్రి శైలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా పని చేసి పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని మాజీమంత్రి సాకే శైలజనాథ్ పిలుపునిచ్చారు. మండల వైసిపి నాయకులు సోమవారం అనంతపురంలో శైలజానాథ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులతో మాటామంతి నిర్వహించారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, పెద్ద కొండయ్య, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



శైలజానాథ్‌ను సన్మానిస్తున్న బుక్కరాయసముద్రం నాయకులు

జలవనరుల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే సునీత

అనంతపురం రూరల్ : జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హంద్రీనీవా పరిధిలో భూగర్భజలాలు అడుగంటకుండా చెరువులకు నీరు అందించాలని కోరారు. రైతుల బాధలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవడంతోపాటు జీడిపల్లి–పేరూరు ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్నాకే ముందుకెళ్తామని హామీ ఇచ్చారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-హిందూపురం

పోలీసు శాఖ నేతృత్వంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని హిందూపురం డీఎస్పీ వికె. మహేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై బాధితులు ఫిర్యాదులు అందజేశారు. ఇందుకు స్పందించిన డి.ఎస్.పి మహేష్ వెను వెంటనే బాధితులతో చర్చించి పలు సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరింపజేశారు. మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి సోమవారం హిందూపురం వన్ టౌన్ వేదికగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని హిందూపురం సబ్ డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూపురం సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, జనార్ధన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఎస్పీ

బడ్జెట్‌లో చేనేతలకు రూ. రెండువేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు రూ. 2వేల కోట్లు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలా లక్ష్మీనారాయణ, గౌరవఅధ్యక్షులు వెంకటస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుడగ వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ధర్మవరం ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో మహేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశ పెట్టబోతున్న నేపథ్యంలో న బడ్జెట్ లో చేనేత రంగానికి రెండువేల కోట్ల రూపాయల నిధులను కేటాయించాలన్నారు. ముఖ్యంగా ధర్మవరం ప్రాంతంలో తీవ్రమైన సంక్షోభంలో ఉందనిఈ కారణంగా చేనేత కార్మికులకు పనులు లేక చేసిన అప్పులు తీర్చలేక ఆకలి చావులకు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. సహకార సంఘాలు కార్మికులకు ఉపాధి చూపించలేని దీన స్థితిలోకి వెళ్లాయన్నారు. ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేతలకు నేతన్న నేస్తం రూ.24 వేల నుండి, 36 వేల రూపాయలుకు పెంచి నేతన్న నేస్తంకు కూడా బడ్జెట్ లో నిధులు కేటాయించి కార్మికులను వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు సిరివెళ్ల దేవేంద్ర, చెన్నం పల్లి శ్రీనివాసులు, అమర్నాథ్, బాల రంగయ్య, జింకా కేశవ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని చెరుకురు సమీపంలో టింబక్టు కలెక్టివ్ సంస్థ వద్ద సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. రొప్పల గ్రామానికి చెందిన అంజనప్ప (55) తన సొంత పని నిమిత్తం దొమ్మతిమర్రి వెళ్లి ద్విచక్రవాహనంలో వస్తుండగా టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ సమీపాన ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అంజనప్ప అక్కడికక్కడే మృతిచెందాడు.

అగ్నిప్రమాదంలో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని మద్దనకుంట గ్రామానికి చెందిన క్రిష్టప్ప అనే రైతుకు చెందిన గడ్డివామి అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డివామి పూర్తిగా కాలి బూడిదయిందని దీంతో తనకు దాదాపు 2 లక్షల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు గుడిబండ తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఫైర్ ఇంజన్ వచ్చి ఆర్పేలోపు మొత్తం పశుగ్రాసమంతా కాలి బుడిదయిందని వాపోయాడు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని కోరాడు.

దగ్ధమవుతున్న గడ్డివామి

దగ్ధమవుతున్న పచ్చని పొలాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

వేసవి కాలం రాక మునుపే ఎండలు మండి పోతున్నాయి. భూగర్భ జలాలు అడగంటడంతో బోర్లలో అరకొరా నీరు ఉంది. రైతులు అప్పో సొప్పో చేసి పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఆకతాయిలు రోడ్డు పక్కన నిప్పు పెట్ట తుండటంతో అది అంతకు అంతకు వ్యాప్తి చెందుతూ ఇలా బోరు క్రింద సాగుచేసిన పంటలు దగ్ధం అవ్వడానికి కారణం అవుతున్నాయి. ఇటీవల లేపాక్షి మండలంలో సుమారు 5 ఎకరాలలో వేసిన కందిపంట దగ్ధం అయింది. ఇప్పుడు తాజాగా చిలమత్తూరు మండలంలోని కోడూరులో శ్రీరాములు కి చెందిన మొక్క జొన్న పంట సుమారు రెండు ఎకరాలు పాక్షికంగా దెబ్బతినింది. నీటి బోరు వైర్లు, మీటరు కూడా కాలి బూడిదయ్యాయి. ఆకతాయిలు చేసే పనులకు పంటపొలాలు దగ్ధం అవ్వడం పట్ల రైతులు ఆవేదన చెందుతున్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి మడకశిర

రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి సోమవారం కలిశారు. అమరావతిలోని సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో నీటిపారుదల, తాగునీటికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. నియోజవర్గంలో పెండింగ్ లో ఉన్న పలు నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గం లో అవసరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. అదే విధంగా ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొలు రవీంద్రను టిడిపి కుంచిటి వక్కలిగ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్పను కలిశారు. విజయవాడలోని సచివాలయంలో మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రవ్యాప్తంగా బీసీల అభివృద్ధికి బలోపేతానికి చేపట్టాల్సిన పలు విషయాలపై ఇరువురు చర్చించారు.

స్పేస్ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే

పజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ కుమ్మరవాండ్ల పల్లిలో వున్న స్పేస్ జూనియర్ కళాశాలలో సోమవారం ఫేరవెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హరీష్ స్కూల్స్ అడ్వయిజర్ ప్రశాంత్, ప్రిన్సిపల్ కిరణ్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై శ్రద్ధ వహిస్తేనే గమ్యం సాధ్యమవుతుందని తెలిపారు. కష్టపడికాకుండా ఇష్టపడి చదివితేనే మంచి మార్కులు వస్తాయని, అలాగే పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధిని పెంపొందించాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కదిరి సిడిపిఒ రాధిక అంగన్వాడీ కార్యకర్తల ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల సమగ్రాభివృద్ధి పెంపొందించడం కోసం అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డి, సూపర్వైజర్లు నరసమ్మ, లక్ష్మీదేవి, మౌలాబి, ఆర్‌సిలు మహేశ్వరరెడ్డి,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నీటి సౌకర్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో పుట్టపర్తి మండలంలోని కప్పల బండ పంచాయతీలో తాగునీటి సమస్యకు అధికారులు పరిష్కారం చూపారు. కప్పల బండ పంచాయతీలో ప్రజలు తాగునీటి సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నారని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశాల మేరకు రూ.5.50 లక్షల మండల నిధులతో సోమవారం నూతన బోరు వేసారు. మామిళ్ళకుంట క్రాస్ లోని దేవాలయం వెనుక వైపున 520 అడుగులు నూతన బోరు వేయడంతో నీరు పుష్కలంగా లభించాయి. గ్రామస్తుల విన్నపం మేరకు నీటి పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి తక్షణమే నూతన బోరు,పైపు లైన్ పనులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి కప్పల బండ పంచాయతీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నూతన బోరు ఏర్పాటుకు సహకరించిన స్థానిక సర్పంచి, ఎంపీటీసీ, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

కందుల కొనుగోలు కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - రొద్దం

మండల కేంద్రంలో ఉన్న కందుల కొనుగోలు కేంద్రాన్ని పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు వెంకటేష్, రామకృష్ణతో మాట్లాడారు. కందుల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం రైతులు వద్ద గత వారం రోజుల నుంచి కొనుగోలు చేసిన కందుల దిగుబడి బస్తాలు మొత్తం 10 వేల బస్తాల వరకు నిల్వ ఉన్నాయని ఈ నిలువ ఉన్న బస్తాలకు మార్క్‌ఫెడ్ అధికారులు లారీలను పంపించడం లేదని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. దీ ఈ విషయంపై ఆర్డీవో స్పందించి వెంటనే నిలువ ఉన్న బస్తాలను లారీల ద్వారా తరలించే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజ్, డిటి చంద్రశేఖర్, విఆర్ఒ రామమోహన్, శ్రీదేవి, ఏజెన్సీ నిర్వాహకులు వెంకటేష్, రామకృష్ణ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో